దశాబ్దానికి ముందు చాప కింద నీరులా విస్తరించిన ఎయిడ్స్ మహమ్మారి వెనకడుగు వేస్తోంది. దీనికి ప్రభుత్వం చేసిన కృషి సత్ఫలితాన్నిస్తోంది. ఎయిడ్స్ కు నివారణ ఒక్కటే మార్గమంటూ ప్రభుత్వం చేసిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లింది. సురక్షితం కాని శృంగారం ఎంత ప్రమాదకరమో కరపత్రాల ద్వారా చాటి చెప్పింది. క్రమంగా ప్రజల్లో చైతన్యం రగిలింది. బహిరంగ చర్చ మొదలైంది. ఎయిడ్స్ వ్యాప్తి అదుపులోకి వచ్చింది. జీవిత భాగస్వామితో కాకుండా ఇతరులతో సురక్షితం కాని శృంగారంలో తరచూ పాల్గొనడం వల్ల హెచ్ఐవీ బారినపడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అలా తన భాగస్వాములనూ ఈ వ్యాధి బారిన పడేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చొరవ తీసుకుని హెచ్ఐవీపై అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు బాధితులకు బాసటగా నిలిచి ఉచిత వైద్యం అందిస్తోంది. పింఛన్ ఇచ్చి ఆర్థికంగా సాయపడుతోంది. జాగ్రత్తల ద్వారా ఆయుష్షు పెంచుకునేలా సూచనలు ఇస్తోంది. దీంతో క్రమేణా హెచ్ఐవి కేసులు నమోదు తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం...

# నిశ్శబ్దం వీడారు


## పెరిగిన అవగాహన..

# హెచ్ఐవి కేసుల తగ్గుముఖం

## సత్ఫలితాలు ఇస్తున్న ప్రభుత్వ చర్యలు

### వ్యాధిగ్రస్తుల జీవనశైలి మెరుగుకు కృషి

### నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం



## అవగాహన పెరిగి.. కేసులు తగ్గాయి

పుట్ల శ్రీనివాస్ (జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నల్గొండ)

జిల్లాలో ఎయిడ్స్ వ్యాధి తగ్గుముఖం పట్టింది. 2008 వ సంవత్సరం లో 9.0 శాతం గా ఉన్న రొగులు సంఖ్య క్రమమగా తగ్గి 0.50 శాతంగా ఉంది. జిల్లాలో ఎచ్ఐవి పైన అవగాహన పెరగడమే కారణం. గ్రామ స్థాయి లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లలో కూడ ఎచ్ ఐ వి పరీక్షలు చేస్తున్నారు. కళా జాత, సాంఘిక మద్యమాలైన ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్, ఎక్స్ ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.సంచార సమీకృత పరిక్ష కేంద్రాన్ని ఆగస్టు 2024 న జిల్లా కలెక్టర్ ద్వారా ప్రారంభించి జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు సేవలు అందిస్తున్నాం.మిర్యాలగూడ, దామరచర్ల తదితర ప్రాంతాలలో ఉన్న పరిశ్రమమలో ని వలస కార్మికులకు అవగాహన కల్పించి, పరీక్షలు చేస్తున్నాం. ఈ ఏడాది నూతనంగా యట్ రిస్క్ క్లయింట్స్ ను గుర్తించి వారు ఎచ్ఐవి వ్యాధి బారిన పడకుండా సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని నల్లగొండలోని జిజిఎచ్ లో ప్రారంభిచాము. కళాశాలలోని విద్యార్దులకు ఎచ్ఐవి, రక్త దానం మీద అవగాహన కల్పించి రెగ్యులర్ గా వీటిపై వివిధ రకాలైన పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తున్నాం.రెడ్ రన్ క్విజ్ పోటీలలో రాష్ట స్థాయిలో నల్లగొండ జిల్లా కు మారథాన్ లో ప్రధమ బహుమతి, క్విజ్ లో ద్వితీయ బహుమతి లభించింది. నాకో ఆదేశాల మేరకు 2030 నాటికి నల్లగొండను ఎచ్ఐవి రహిత జిల్లాగా రూపొందించడానికి ప్రయత్నాలు జరుగుచున్నాయి.



నల్గొండ, ప్రజాజ్యోతి ప్రతినిధి:

హెచ్ఐవీ, ఇది సోకగానే నయం కాదని.. చనిపోవడం ఖాయమని నమ్మే జనం నేటికీ కోకొల్లలుగా ఉన్నారు. వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందినా ఆధునిక వైద్య సేవలు ఎన్ని అందుబాటులోకి వచ్చినా కంప్యూటర్ కాలం లో కూడా హెచ్ఐవీపై ఉన్న అనుమానాలు, భయాలు పూర్తిగా ప్రజల్లో నుంచి తొలగిపోలేదు. హెచ్ఐవీకి నేడు ఎన్నో వైద్య సేవలు ఉచితంగా లభిస్తూ మనిషి జీవిత కాలాన్ని పెంచుతున్నాయి. 1986 సంవత్సరంలో తమిళనాడులో ఎయిడ్స్ సోకిన వ్యక్తిని భారతదేశంలో మొట్టమొదటిసారిగా గుర్తించారు. వరల్డ్ ఎయిడ్స్ డేను 1987 నుంచి జరుపుకుంటున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్ 1న వరల్డ్ ఎయిడ్స్ డే నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది హెచ్ఐవీతో ఉన్నవారిని అన్ని రంగాల్లో సమాన త్వంగా చూడటం అనే నినాదంతో ఎయిడ్స్ డే నిర్వ హిస్తున్నారు.

### హెచ్ఐవీ అంటే..

హ్యూమన్ ఇమ్యూనో డెఫిషెన్సీ వైరస్ ను హెచ్ఐవి అంటారు. ఇది మనిషిలో రోగ నిరోధక శక్తిని తగ్గించే ఒక రకమైన వైరస్. హెచ్ఐవీ కారణంగా వ్యాది నిరోధక శక్తి తగ్గి అనేక వ్యాధి లక్షణాలు కలిగి ఉండటాన్ని ఎయిడ్స్ అంటారు. సురక్షితం కాని లైంగిక సంబంధాల ద్వారా ఇది సోకుతుంది. వైరస్ సోకిన రక్తం ఇతరులకు ఎక్కించటం ద్వారా కూడా వస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా 38.4 మిలియన్ల మంది, భారతదేశంలో 28 లక్షల మంది, నల్లగొండ జిల్లాలో 10634 మంది హెచ్ఐవీ బాధితులు ఉన్నారు. హెచ్ఐవీ సోకకుండా సంభోగ సమయంలో తప్పనిసరిగా కండోమ్ వాడాలి. అవస రమైన ప్రతిసారి కొత్త సూదులు, సిరంజులు, బ్లేడ్లు ఉపయోగించాలి. పరీక్ష చేసి హెచ్ఐవీ లేదని నిర్ధారించిన తర్వాతే రక్తాన్ని ఇతరులకు ఎక్కించాలి.

### నేడు ఉదయం 10 గంటలకు సెమినార్..

నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నల్లగొండ లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు హెచ్ఐవి పై సెమినార్ ను ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పాటు ఎన్జీవోలు, చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ నుండి పిల్లలు హాజరుకానున్నారు. ఈ ఏడాది బెస్ట్ పర్ఫామెన్స్ చేసిన వారికి బహుమతిని ఇవ్వనున్నారు. కొన్ని రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన డిబేట్, రీల్ మేకింగ్, పోస్టర్ మేకింగ్ గెలుపొందిన వారికి మెమెంటోలు ఇవ్వనున్నారు.

### ప్రభుత్వం కల్పిస్తున్న సేవలు..

రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఐవీ బాధితులకు అనేక వైద్య సౌకర్యాలు కల్పిస్తోంది. జిల్లా వ్యాప్తంగా హెచ్ఐవీ నిర్ధారణ చేసేందుకు సమగ్ర సలహా, పరీక్షా కేంద్రాలు (ఐసీటీసీ) 3 ఉన్నాయి. లింక్ ఆర్ట్ సెంటర్లు 4, ప్రభుత్వ రక్త నిధి కేంద్రాలు 1, ప్రైవేటు రక్త నిధి కేంద్రాలు 7 ఉన్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 10634 కేసులు ఉండగా, 6910 మంది చికిత్స పొందుతున్నారు. పెన్షన్ తీసుకుంటున్న వారి సంఖ్య 2521 మంది ఉన్నారు. వీరంతా ప్రతినెల 2016 పింఛన్ ను రాష్ట్ర ప్రభుత్వం నుండి పొందుతున్నారు. రెగ్యులర్ గా ఆర్ట్ సెంటర్ లో మందులు వాడుతున్నవారు మధ్యలో మానేసిన వారి కోసం కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ ద్వారా గుర్తించి వారిని మళ్ళీ మందులు వాడేవిధంగా చేస్తున్నారు.

టిబి సోకిన ప్రతి ఒక్కరికి హెచ్ఐవి పరీక్ష, అలాగే హెచ్ఐవి ఉన్న వాళ్ళకు కూడా టీబి పరీక్షలు చేసి పాజిటివ్ వచ్చిన వాళ్ళకు తగు చికిత్స అందజేస్తున్నారు. అలాగే జిల్లా జైలు, సబ్ జైలు, స్వధర్ హోమ్ లో ప్రతి నెల హెచ్ఐవి పరీక్షలు జరిపి పాజిటివ్ ఉన్నవారికి చికిత్స చేస్తున్నారు. ఏప్రిల్ 2024 నుండి అక్టోబర్ 2024 వరకు 311 మందిని రక్షించగా 7 గురు పాజిటివ్ గా గుర్తించి ఏఆర్టి కి అనుసంధానం చేశారు.జిల్లా న్యాయ సేవా సదన్ సహకారంతో పడుపు వృత్తి, స్వలింగ సంపర్కులకు రేషన్ బియ్యం ప్రతి వ్యకి కి 10 కిలో గ్రాములు చొప్పన ఇప్పిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 30 మంది కి ఇవ్వడం జరిగింది.

### జిల్లాలో తగ్గుముఖం పట్టిన కేసులు...

గత 2023 - 24 సంవత్సరం 47353 మంది సాధారణ వ్యక్తులకు హెచ్ఐవీ పరీక్షలు చేయగా 518 మందికి ఉన్నట్లు తేలింది (1.09 శాతం) గా వుంది. అదేవిధంగా 23607 మంది గర్భిణీలకు పరీక్షలు చేయగా 77 మందికి ఉన్నట్లు తెలిసింది.(0.33) నిర్ధారణ అయింది. 2024 ఏప్రిల్ నెల నుండి అక్టోబర్ నెల వరకు 29585 మందికి పరీక్షలు చేయగా 247 మందికి హెచ్ఐవి ఉన్నట్లు నిర్ధారణ అయింది. అదేవిధంగా 12954 మంది గర్భిణీలకు పరీక్ష చేయగా 30 మందికి నిర్ధారణ అయింది.(0.23) గా వుంది.గత 16 సంవత్సరాల నుండి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 9.00 శాతం నుండి 0.50 శాతానికి కేసులు తగ్గ ముఖం పట్టాయి.

### పల్లె సిద్దుల ద్వారా అవగాహన...

ప్రతి సంవత్సరము జిల్లా లో హెచ్ఐవి ఎక్కవగా ఉన్న ప్రాంతాలలో పల్లె సుద్దులు, కళ జాతా ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే కాలేజీ విద్యార్ధులకు హెచ్ఐవి, టీబి స్వచ్ఛంద రక్తదానం పైన క్విజ్ పోటీలు, స్కూల్ పిల్లలకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు పెట్టి బహుమతులు అందజేస్తున్నారు.